దిక్సూచి

గ్రూప్-2 పేపర్-3

భారత ప్రణాళికలు - సామాజిక, ఆర్థిక లక్ష్యాలు

డాక్టర్ టి.సాయిలు

వివిధ పంచవర్ష ప్రణాళికల్లో జాతీయాదాయం, తలసరి ఆదాయాల్లో జరిగిన వృద్ధి ఈ కిందివిధంగా ఉంది.

ప్రణాళిక	వార్షిక వృద్ధిరేటు జాతీయ ఆదాయం	తలసరి ఆదాయం
మొదటి ప్రణాళిక (1951-56)	4.4	2.6
రెండో ప్రణాళిక (1956-61)	4.0	2.0
మూడో ప్రణాళిక (1961-66)	2.6	0.4
నాలుగో ప్రణాళిక (1969-74)	3.1	0.8
ఐదో ప్రణాళిక (1974-79)	4.9	2.6
ఆరో ప్రణాళిక (1980-85)	5.4	3.1
ఏడో ప్రణాళిక (1985-90)	5.5	3.3
ఎనిమిదో ప్రణాళిక (1992-97)	6.7	4.5
తొమ్మిదో ప్రణాళిక (1997-2002)	5.3	3.3
పదో ప్రణాళిక (2002-07)	7.8	6.1

1929లో సంభవించిన అతిపెద్ద ఆర్థికమాంద్యం ఒక రష్యాను తప్ప ప్రపంచ దేశాలన్నింటినీ ప్రభావితం చేసింది. 1917లో రష్యాలో బొల్షివిక్ విప్లవం విజయం సాధించిన తరవాత రష్యా తన ఆర్థికాభివృద్ధికి ప్రణాళికా విధానాన్ని ఎన్నుకున్నది. అప్పటివరకు వస్తువు డిమాండ్, సప్లయ్‌లు (మార్కెట్ శక్తులు) ప్రభావితం చేసే పెట్టుబడి దారీ ఆర్థికవ్యవస్థనే అన్ని దేశాలు అనుసరిస్తున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఏ సమస్య వచ్చినా అదృశ్య హస్తం (మార్కెట్ శక్తులు) పరిష్కారం చూపుతుందనే ఒక నమ్మకం ఉంది. 1929 ఆర్థిక మాంద్యానికి ఈ అదృశ్య హస్తం పరిష్కారం చెప్పకపోవడంతో ఆ నమ్మకం ఒక భ్రమేనని రుజువైంది. అందువల్ల ఆర్థికవ్యవస్థను పూర్తిగా మార్కెట్ శక్తులకు వదలడం కాకుండా ప్రభుత్వం జోక్యం చేసుకోవాలనే భావనకు మద్దతు పెరిగింది. సామ్యవాద ఆర్థికవ్యవస్థను స్థాపించడానికి రష్యా తన ప్రధాన ఉత్పత్తి కారకాలను జాతీయం చేసి పంచవర్ష ప్రణాళికలను రూపొందించి ఆర్థికాభివృద్ధికి కృషిని ఆరంభించింది. ఈ క్రమంలో పెట్టుబడిదారీ విధానం అనుసరిస్తున్న అమెరికాకు ధీటుగా ఎదిగింది.

ఈ నేపథ్యంలో 1934లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య భారతదేశం ప్రణాళికాబద్ధమైన ఆర్థికాభివృద్ధి నమూనాను ఎన్నుకోవాలని సూచిస్తూ ఒక గ్రంథం (ప్లాన్డ్ ఎకానమీ ఫర్ ఇండియా) రచించారు. 1943లో బొంబాయికి చెందిన ఎనిమిదిమంది పారిశ్రామికవేత్తలు 'బొంబాయి ప్రణాళిక'ను రూపొందించారు. ఎం.ఎన్.రాయ్ 'ప్రజా ప్రణాళిక', ఎస్.ఎన్.అగర్వాల్ 'గాంధేయ ప్రణాళిక'ను రూపొందించారు. 1950లో ప్రధానమంత్రి అధ్యక్షతన ఒక ప్రణాళికాసంఘాన్ని ఏర్పాటుచేయడంతో స్వతంత్ర భారతంలో 'ఆర్థిక ప్రణాళిక' ఆరంభమైంది. భారతదేశంలో ప్రణాళిక వ్యవస్థ అంతిమలక్ష్యం సామ్యవాద తరహా సమాజ స్థాపన. సామ్యవాద వ్యవస్థకు సామ్యవాద తరహా వ్యవస్థకు చాలా తేడా ఉంటుందన్నది గుర్తుంచుకోవాలి.

సామ్యవాద వ్యవస్థలో ప్రధాన ఉత్పత్తి కారకాలన్నీ ప్రభుత్వం చేతిలో ఉండి ఉత్పత్తిని, పంపిణీని ఓ కేంద్రీకృత వ్యవస్థ నిర్వహిస్తుంది. ఇక సామ్యవాద తరహా సమాజం అంటే ఆదాయ పంపిణీలో, సంపద పంపిణీలో అసమానతలు తీవ్రంగా ఉండకుండా జాగ్రత్తపడుతూ ప్రజలందరికీ సమానంగా విద్య, ఉపాధి అవకాశాలను కల్పించడం.

ఈ అంతిమలక్ష్యం (ప్రధాన ఆశయం)ను దృష్టిలో పెట్టుకొని ప్రతి ప్రణాళికలో లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. ఆ లక్ష్యాల సా ధనకు వివిధ రంగాలకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యం ఇచ్చారు. 1951 ఏప్రిల్ 1 నుంచి 2007 మార్చి 31 వరకు మన దేశంలో పది పంచవర్ష ప్రణాళికలు అమలు జరిగాయి. (పదకొండో పంచవర్ష ప్రణాళిక కాలం 2007, ఏప్రిల్ 1 నుంచి 2012 మార్చి 31 వరకు.)

ఆర్థిక ప్రణాళిక లక్ష్యాలు

1. జాతీయాదాయాన్ని, తలసరి ఆదాయాన్ని పెంచడం.
2. స్వయం సమృద్ధి, స్వావలంబన.
3. ఉపాధి అవకాశాల విస్తరణ.
4. పేదరిక నిర్మూలన.
5. ఆదాయ అసమానతల తగ్గింపు.
6. సంపూర్ణ అక్షరాస్యత.
7. ఆరోగ్య ప్రమాణాల వృద్ధి.



పై లక్ష్యాల సాధనలో భారత పంచవర్ష ప్రణాళికలు ఎంతవరకు విజయం సాధించాయో పరిశీలిద్దాం.

జాతీయాదాయం, తలసరి ఆదాయాల వృద్ధి

ప్రతి పంచవర్ష ప్రణాళికలోనూ జాతీయాదాయాన్ని, తలసరి ఆదాయాన్ని వృద్ధి చేయాలనే లక్ష్యాన్ని ఉంచారు. ఫలితంగా స్థిరమైన ధరల్లో జాతీయాదాయం 1950-51లో రూ.2,24,786 కోట్లు ఉండగా 2008-09లో రూ.33,39,374 కోట్లు. తలసరి ఆదాయం 1950-51లో రూ.5708 ఉండగా 2008-09లో రూ.24,494గా ఉంది.

పదకొండో పంచవర్ష ప్రణాళిక (2007-12) కాలంలో ప్రతి సంవత్సరం 9 శాతం వృద్ధిని సాధించాలని, చివరి సంవత్సరం 10 శాతం ఆర్థిక వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2007-08లో 9 శాతం, 2008-09లో 6.7 శాతం ఆర్థిక వృద్ధి సాధ్యమైంది.

వ్యవసాయరంగ అభివృద్ధి

మొదటి పంచవర్ష ప్రణాళికలో వ్యవసాయరంగ వృద్ధి కోసం ఎక్కువ శాతం నిధులను కేటాయించి వ్యవసాయరంగానికి ప్రాధాన్యతనిచ్చారు. రెండో పంచవర్ష ప్రణాళిక కాలంలో నూతన వ్యవసాయక వ్యూహాన్ని అమలుపరచి అధిక ఉత్పాదకతను ఇచ్చే ఆధునిక వంగాలను సరఫరా చేయడంతోపాటు రసాయనిక ఎరువులను, క్రిమిసంహారక మందులను రైతులకు అందించారు. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల వచ్చింది. ఫలితంగా స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఆహార ధాన్యాల కోసం విదేశాలపై ఆధారపడిన మన దేశం ప్రస్తుతం ఆ విషయంలో స్వయం సమృద్ధిని కలిగి ఉంది.

1960-61లో మొత్తం ఆహారధాన్యాల ఉత్పత్తి 82 మిలియన్ టన్నులు ఉండగా 2008-09లో 230.0 మిలియన్ టన్నులుగా ఉంది. అందులో అదేకాలంలో బియ్యం ఉత్పత్తి 34.6 మిలియన్ టన్నుల నుంచి 99 మిలియన్ టన్నులకు, గోధుమల ఉత్పత్తి 11.0 మిలియన్ టన్నుల నుంచి 77.6 మిలియన్ టన్నులకు, పప్పుధాన్యాల ఉత్పత్తి 12.7 మిలియన్ టన్నుల నుంచి 14.2 మిలియన్ టన్నులకు, మొక్కజొన్నల ఉత్పత్తి 4.1 మిలియన్ టన్నుల నుంచి 18.5 మిలియన్ టన్నులకు పెరిగింది. అదేకాలంలో వాణిజ్య పంటల్లో నూనెగింజల ఉత్పత్తి 7.0 మిలియన్ టన్నుల నుంచి 28.1 మిలియన్ టన్నులకు, పత్తి ఉత్పత్తి 5.6 మిలియన్ టన్నుల నుంచి 23.3 మిలియన్ బేళ్లకు పెరిగింది.

వివరాలు ఇవిగో



'ఫిట్‌నెస్' సంస్థల వివరాలు..

❍ **నా వయస్సు 19 సంవత్సరాలు. బిఎస్సీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ మూడో ఏడాది చదువుతున్నాను. ఫిట్‌నెస్ ట్రైనర్ కావాలని అనుకుంటున్నాను. సంబంధిత శిక్షణ అందించే సంస్థల వివరాలు తెలుపగలరు.**

- సరస్వతి, హైదరాబాద్

✎ గృహిణులు మొదలుకుని కార్పొరేట్ ఉద్యోగుల వరకు అన్ని కేటగిరీలకు చెందిన వ్యక్తులు ఫిట్‌నెస్‌పై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇటీవలి కాలంలో ఈ ట్రెండ్ ఎక్కువైంది. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ చేస్తున్న మీరు చాలావరకు శిక్షణ పొందినట్లే లెక్క. మీరు మరింతగా పదును తేలేందుకు తోడ్పడే కొన్ని ప్రఖ్యాత సంస్థలూ ఉన్నాయి. రీబక్ ఇండియా, నైక్, తల్వాల్కర్స్ వంటివి వాటిలో కొన్ని.

రీబక్ అందించే కోర్సు 80 గంటల నిడివి గలది. అందులో 30 గంటలు థియరీకి, తతిమా సమయాన్ని ప్రాక్టికల్ శిక్షణకు కేటాయిస్తారు. కోర్సు చివర్లో పరీక్ష కూడా ఉంటుంది. అందులో రాత అలాగే ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. ఆ రెంటినీ విజయవంతంగా పూర్తి చేస్తే రీబక్ సర్టిఫైడ్ ఫిట్‌నెస్ ఇన్‌స్ట్రక్టర్ కాగలుగుతారు. స్టెప్ రీబక్ మినహాయిస్తే మిగిలిన వాటిలో చాలా ప్రోగ్రామ్‌లకు పెద్దగా పరికరాల అవసరం ఉండదు. కోర్సు పూర్తి చేసిన తరవాత హెల్త్‌క్లబ్ లేదా జిమ్‌లో సీనియర్ ఏరోబిక్ ఇన్‌స్ట్రక్టర్ వద్ద పనిచేయాల్సి ఉంటుంది. ఆ తరవాతి స్థాయిలో పర్సనల్ ట్రైనర్‌గా ఎదగవచ్చు. కార్పొరేట్ ఫిట్‌నెస్ ప్రోగ్రామ్‌లకు సైతం ఈ రోజుల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ వృత్తిలో అధ్యయనానికి, అలాగే అనుభవ సాధనకు హద్దు అంటూ ఏదీ లేదు. పరిశోధన ఫలితంగా సరి కొత్త పరికరాలు వస్తుంటాయి. వాటిపై శిక్షణ ఇవ్వడంలోనూ ముందుండాలి. దీనికితోడు యోగా, పిలెట్స్, టాయిచీ, భాంగ్రా వంటి వాటిని కలుపుకొంటే మీరు చెప్పే క్లాసుల్లో కొత్తదనం ఉంటుంది. పాపులారిటీ పెరుగుతుంది.

ఆరంభంలో పెద్ద మొత్తాలు అందుకోలేకపోవచ్చు. అయితే, అనుభవం పొంది మీకంటూ ఒక స్టయిల్ ఏర్పడ్డాక వేతనం తప్పకుండా పెరుగుతుంది. ధనవంతులు లేదా ప్రసిద్ధి చెందిన వ్యక్తులకు పర్సనల్ ట్రైనర్లుగా నిలదొక్కుకుంటే మరింత మంచి మొత్తాలను అందుకోగలుగుతారు. అదేవిధంగా మంచి పేరుతెచ్చుకోగలిగితే, టీవీ ఛానళ్లలో ఫిట్‌నెస్ ప్రోగ్రామ్‌లు, హెల్త్ షోలు ఇవ్వగలుగుతారు. సరిగ్గా ఆ ఇమేజ్, క్లయింట్ల పెంపునకు దోహదపడుతుంది.

పొలిటికల్ సైన్స్‌తో అవకాశాలు

❍ **నేను ఎమ్మె పొలిటికల్ సైన్స్ చదువుతున్నాను. ఫైనల్ ఇయర్‌లో ఉన్నా. ఈ కోర్సు చేసిన తరవాత నాకు ఉన్న అవకాశాలు తెలియజేయండి?**

- కె.వి.రమణ, జగిత్యాల, కరీంనగర్ జిల్లా

✎ ప్రభుత్వ వ్యవస్థలు వాటి కార్యకలాపాలను పొలిటికల్ సైన్స్‌లో అధ్యయనం చేస్తారు. అంతర్జాతీయ సంబంధాలు, పొలిటికల్ థియరీలు, చరిత్ర, పొలిటికల్ ఎకానమీ, విదేశాంగ విధానాలు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ తదితరాలను కూడా చదువుతారు. దరిమిలా ఎమ్మే పొలిటికల్ సైన్స్ చేసిన వ్యక్తి ప్రధానంగా అవకాశాలు ఈ విధంగా ఉంటాయి.

పొలిటికల్ సైన్స్ లేదా ఇంటర్నేషనల్ రిలేషన్స్ అధ్యాపకుడిగా కాలేజీ/ యూనివర్సిటీల్లో చేరవచ్చు. జాతీయ స్థాయిలో యుజిసి నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) లేదా రాష్ట్రాల స్థాయిలో జరిగే స్టేట్ లెవెల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (స్లెట్) ఆధారంగా వాటిల్లో చేరవచ్చు. సివిల్ సర్వీసెస్ మంచి ఆప్షన్. అందులో ఇండియన్ ఫారిన్ సర్వీస్ ఎంపిక చేసుకోవచ్చు. సివిల్ సర్వీసెస్‌కు ఉద్దేశించిన పరీక్షలో జనరల్ స్టడీస్ పేపర్ ఉంటుంది. ఇండియన్ పాలిటీ, కరెంట్ అఫైర్స్‌పై ప్రశ్నలు ఒకమేర ఉంటాయి. వాటికీ సబ్జెక్టు అధ్యయనం బాగా ఉపకరిస్తుంది. బాగా రాయగలిగే సత్తా ఉంటే మీడియా అంటే వార్తా పత్రికలు, టెలివిజన్ ఛానళ్ళలో చేరవచ్చు. అలాగే, ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలిసిస్, సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్, అలీన దేశాలకు సంబంధించిన రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ వరల్డ్ అఫైర్స్, ఇన్‌స్టిట్యూట్ ఫర్ పీస్ అండ్ కాన్‌ఫ్లిక్ట్ రిజల్యూషన్స్, ఇండియ ఇంటర్నేషనల్ సెంటర్, నెహ్రూ మెమోరియల్ మ్యూజియం వంటి ప్రసిద్ధ సంస్థల్లో పరిశోధన కార్యకలాపాలు చేపట్టవచ్చు.

- గోవర్ధనం కిరణ్‌కుమార్

చిరునామా: **వివరాలు ఇవిగో,** కేరాఫ్ ఎడ్యుకేషన్ డెస్క్, ఆంధ్రజ్యోతి, ప్లాట్ నెం.76, రోడ్ నెం.70, అశ్విని ఎన్‌క్లేవ్, హుడాహైట్స్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500 033

అవకాశాలకు ఆలవాలం ఎన్‌సిసి

పండిట్ హెచ్.కుంజ్రూ కమిటీ సిఫారసుల మేరకు జాతీయ యువ రక్షక దళం (ఎన్.సి.సి) 1948లో ఏర్పాటయింది. తొలుత 38,500 మంది క్యాడెట్లతో ఎన్‌సిసి ప్రారంభమైంది. ప్రస్తుతం దేశంలోని మారుమూల ప్రాంతాలకు సైతం అది విస్తరించింది. ఎన్‌సిసి క్యాడెట్ల సంఖ్య 13 లక్షలకు చేరింది. దేశ వ్యాప్తంగా బాలబాలికలు, యువతీ యువకులు సభ్యులుగా ఉన్న జాతీయ యువ రక్షక దళం శిక్షణ..వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా..సమాజంలోని అన్ని రంగాల్లో మంచి నాయకత్వ పటిమగల వారిగా రూపొందిస్తుంది.

నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సమగ్రత, సాహసం, సైనిక, శారీరక దృఢత్వంతో పాటు సామాజిక అభివృద్ధి కోసం శిక్షణనందించే ఏకైక విభాగం దేశంలో ఎన్‌సిసి ఒక్కటే! 'ఐక్యత..క్రమశిక్షణ' విలువలను పాదుగొల్పడమే లక్ష్యంగా ఎన్‌సిసి పని చేస్తోంది.

నిర్మాణం

దేశంలోని 586 జిల్లాల్లో ఎన్‌సిసికి 765 యూనిట్లు ఉన్నాయి. మొత్తం 6,985 పాఠశాలలు, 5,159 కళాశాల్లో అవి పని చేస్తున్నాయి. త్రివిధ దళాలకు చెందిన అధికారులు, నాన్ కమిషన్డ్ అధికారులు, పూర్తి కాల మహిళాధికారులు, పాఠశాలలు-కళాశాలల్లో బోధనా విభాగంలో పని చేసే అనుబంధ అధికారులు వేలాది మంది ఎన్‌సిసి శిక్షకులుగా విధులు నిర్వహిస్తున్నారు.

విభాగాలు

ఎన్‌సిసిలో రెండు విభాగాలున్నాయి. పాఠశాలల స్థాయిలో జూనియర్, కళాశాలల స్థాయిలో సీనియర్ విభాగాలు పని చేస్తున్నాయి. ఆయా పరీక్షల్లో ఉత్తీర్ణులైన క్యాడెట్లకు ఎ, బి, సి సర్టిఫికేట్లను ప్రదానం చేస్తారు.

ఇన్‌సెంటివ్స్

ఉపకార వేతనాల రూపంలో ఎన్‌సిసి క్యాడెట్లు కొన్ని ఆర్థిక ప్రయోజనాలను పొందుతారు. రెండు సంవత్సరాల శిక్షణను 60 శాతం హాజరీతో పూర్తి చేసుకొన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఎన్‌సిసి కేంద్రం ఏటా 200 రూపాయల ఉపకార వేతనాన్ని అందిస్తుంది. శిక్షణలో క్యాడెట్లు గాయాలపాలైతే వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయూతను అందిస్తారు. క్యాడెట్లకు అంగవైకల్యం ఏర్పడితే ప్రత్యేక చికిత్స కోసం లక్షరూపాయలను..సాధారణ చికిత్సకయితే 50 వేల రూపాయలను అందిస్తారు.

ఆర్థిక చేయూత

ఎన్‌సిసికి నిధులు అందించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి బాధ్యత. ఎన్‌సిసి పనితీరు సామర్థ్యాన్ని పెంచేందుకు నిధులు అందించడం వాటి తప్పనిసరి బాధ్యత.

రాష్ట్ర ప్రభుత్వ వ్యయం

* ఎన్‌సిసిలో పని చేసే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లించాలి.
* కార్యాలయ వసతి, ఫర్నిచర్ తదితరాలను సమ ర్పించడం
* ఎన్‌సిసి క్యాడెట్లకు అందించే అల్పాహారం, వాషింగ్ అలవెన్సులు..
* ఎఎన్‌ఒలకు గౌరవ భృతి చెల్లించడం
* ఎఎన్‌ఒలకు అవసరమైన శిక్షణ వ్యయం
* ఎన్‌సిసి క్యాంప్‌ల నిర్వహణకు అవసరమయ్యే వ్యయంలో 25 శాతం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలి. మిగతా 75 శాతం వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది.

ఉద్యోగాల్లో బోనస్ మార్కులు

రక్షణ దళాల్లో చేరే ఎన్‌సిసి క్యాడెట్లకు బోనస్ మార్కులుంటాయి. సైనిక నియామకాల్లో శారీరక పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎన్‌సిసి క్యాడెట్లకు కేటాయించే అదనపు మార్కులు ఈ విధంగా ఉంటాయి.

సోల్జర్ జిడీ కేటగిరీ

'ఎ' సర్టిఫికేట్ వారికి-అయిదు శాతం

'బి' సర్టిఫికేట్ వారికి- ఎనిమిది శాతం

'సి' సర్టిఫికేట్ వారికి- 10 శాతం

సోల్జర్ టెక్/సిఎల్‌కె/ఎస్‌కెటి/నర్సింగ్ అసిస్టెంట్లు: లిఖిత పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా వారికి అదనపు మార్కులు కేటాయిస్తారు.

'ఎ' సర్టిఫికేట్ వారికి-అయిదు శాతం

'బి' సర్టిఫికేట్ వారికి- ఎనిమిది శాతం

'సి' సర్టిఫికేట్ వారికి- 10 శాతం

నావికాదళం: నేవీలో సెయిలర్‌గా డైరెక్ట్ ఎంట్రీ వారికి..అప్రెంటిస్‌లకు కింది విధంగా మార్కులు కేటాయిస్తారు.

'ఎ' సర్టిఫికేట్ వారికి-రెండు మార్కులు- అయిదు మార్కులు

'బి' సర్టిఫికేట్ వారికి- నాలుగు మార్కులు- 10 మార్కులు

'సి' సర్టిఫికేట్ వారికి- ఆరు మార్కులు- 15 మార్కులు

వాయుసేన: ఎయిర్ ఫోర్స్‌లో మార్కుల కేటాయింపు కింది విధంగా చేస్తారు.

'ఎ' సర్టిఫికేట్ వారికి-మూడు మార్కులు

'బి' సర్టిఫికేట్ వారికి- నాలుగు మార్కులు

'సి' సర్టిఫికేట్ వారికి- అయిదు మార్కులు.

మిలిటరీ నర్సింగ్ సర్వీస్: మిలిటరీ నర్సింగ్ సర్వీస్‌లో ఎన్‌సిసిలో శిక్షణ పొందిన బాలికలకు 24 సీట్లు కేటాయిస్తారు.

పారామిలిటరీ దళాల్లో ఎన్‌సిసి శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యతనిస్తారు. సీఐఎస్ఎఫ్ (పారిశ్రామిక భద్రతా దళం), కోస్ట్‌గార్డ్ (తీరప్రాంత రక్షక దళం), ఐటీబీపీ(భారత, టిబెట్ సరిహద్దు పోలీస్) విభాగాల్లో భర్తీకి ఆ ప్రాధాన్యం లభిస్తుంది.

అన్నింటికన్నా ముఖ్యంగా భారత సైన్యంలోని త్రివిధ దళాలైన సైన్యం, వాయుసేన, నావికాదళాల్లో ఎన్‌సిసి అభ్యర్థులకు అత్యంత ప్రాధాన్యతనిస్తారు. ఇండియన్ మిలిటరీ అకాడమీ(ఐఎంఎ), ఆఫీసర్స్ ట్రెయినింగ్ అకాడమీ (ఓటీఏ) ప్రవేశాల్లోనూ ఎన్‌సిసి అర్హతలున్న వారికి రిజర్వేషన్ ఉంది.

మొత్తంగా సాధారణ గ్రాడ్యుయేట్లతో పోల్చితే ఎన్‌సిసి సర్టిఫికేట్లు ఉన్న వారు ఉద్యోగం సంపాదించడం తేలిక వుతుంది. ప్రభుత్వంతో పాటు ప్రయివేటు రంగం సైతం భర్తీలో ప్రాధాన్యం కల్పిస్తోంది. ప్రతిష్ఠాత్మక కంపెనీలైన రిలయెన్స్ గ్రూప్, అంబుజా గ్రూప్, టాటా, బిర్లా, ఇన్ఫోసిస్‌తో పాటు పలు బహుళ జాతి సంస్థలు వివిధ ఉద్యోగాలకు ఎన్‌సిసి అభ్యర్థులకు ప్రాధాన్యతనిస్తున్నాయి. అంతే కాక..మిగతా వారితో పోల్చినప్పుడు ఎన్‌సిసి క్యాడెట్‌లో ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ తొణికిసలాడుతాయి. ఉద్యోగ సాధనలో అవి ఎవరికైనా ఎంతో ఉపయుక్తమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

- శంభాజీ

చుక్కాని

మన సిలబస్ మేలు

చుక్కా రామయ్య

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితం పాఠశాల స్థాయిలో సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రవేశపెట్టడానికి నిర్ణయం తీసుకుంది. ఇప్పుడే కాదు ఆదినుంచీ ఆ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాను. ఐఐటి వంటి ప్రతిష్ఠాత్మక జాతీయస్థాయి పరీక్షల్లో సిబిఎస్ఇ సిలబస్‌తో +2 పూర్తి చేసే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి అవకాశముంది. అది తెలిసీ సిబిఎస్ఇ సిలబస్‌ను నేను వ్యతిరేకించడం సమంజసమేనా అని కొందరు ప్రశ్నిస్తున్నారు.

30 సంవత్సరాలుగా ఐఐటి ఎంట్రెన్స్‌కు సిద్ధమయ్యే విద్యార్థుల మధ్య ఉన్నాను. అందువల్ల దానిపై వివరణ ఇవ్వాల్సిన బాధ్యత నాపై ఉందని నేను భావిస్తున్నాను.

1985 నుంచి 2004 వరకు నేను క్లాస్‌రూంలో టీచర్‌గా గడిపాను. సిలబస్‌ల పరంగా చూస్తే ఎంపికైన వారిలో దాదాపుగా 80 శాతం స్టేట్ సిలబస్‌తో కాగా 20 శాతం వరకు సిబిఎస్ఇలో చదివినవారు కనిపించేవారు.

అనుభవపూర్వకంగా నేను గమనించిన విషయమేమిటంటే, ఐఐటి ఎంట్రెన్స్‌లో విజయానికి విద్యార్థి చదివే సిలబస్‌కు పెద్దగా సంబంధం లేదు. ఐఐటి ఎంట్రెన్స్ పరీక్ష విధానంలో విద్యార్థి ఆలోచనా సరళిని పరీక్షిస్తారు. సిలబస్ కన్నా చదివే పద్ధతి ముఖ్యమని విశ్వసించే పరీక్ష అది. ప్రశ్నపత్రంలోని ఏ ప్రశ్నను తీసుకున్నా దీనిని మనం చూడవచ్చు. ఐఐటి ఎంట్రెన్స్ ప్రశ్నపత్రాన్ని అంతర్జాతీయ స్థాయి ప్రొఫెసర్ల సహకారంతో రూపొందిస్తారు. ఇందుకు నిర్దిష్టమైన నియమాలను అనుసరిస్తారు. నేరుగా పుస్తకాల్లోంచి ప్రశ్నలు తీసుకోరాదని, గతంలో వచ్చిన ఏ ప్రశ్న కూడా పునరావృతం కారాదని నిబంధన పెట్టుకుంటారు. ఏ ప్రశ్న కూడా +2 సిలబస్‌ను దాటరాదన్నది మరో ప్రాథమిక నియమం.

విద్యార్థి సృజనాత్మక శక్తిని పరీక్షించే లక్ష్యంతో ఓ ప్రశ్నకు రూపకల్పన జరిగినపుడు, ఒక సమస్యకు 4, 5 సాధనలు ఉంటే దేనిని ఎంచుకుంటారనేది ముఖ్యం.

ఇటీవల కాలంలో మన రాష్ట్రం నుంచి ఎంపికయ్యే వారు పెరిగినా గతంతో పోలిస్తే హాజరవుతున్న స్థాయిలో సెలక్షన్స్ కన్పించకపోవడానికి ఒక కారణం - స్వతహాగా ఆలోచించే లక్షణాన్ని, సృజనాత్మకతను పెంచుకోవడానికి బదులు 'ప్రాక్టీస్'పై దృష్టిపెట్టే విద్యార్థులు పెరగడం! అలాంటివారే ఐఐటి చదువుల్లో ఆశించినస్థాయిలో ప్రతిభ కనబరచడంలేదని కొన్ని పరిశీలనల్లో తేలింది. అంటే విద్యార్థి ఐఐటి ఎంట్రెన్స్‌లో సెలక్ట్ కావాలన్నా, ఆ తరవాత ఐఐటి చదువుల్లో రాణించాలన్నా ఆలోచనా, విశ్లేషణ, సృజనాత్మక సామర్థ్యాలు మెరుగుపర్చుకోవాలి.

మన రాష్ట్ర విద్యార్థులు సిద్ధాంతపరంగా బలంగా ఉంటూ పైన చెప్పిన లక్షణాలు అభివృద్ధి చేసుకొని ఎంపికవుతున్నారు. అలాంటప్పుడు సిబిఎస్ఇ సిలబస్‌కు మారాల్సిన అవసరమేమిటన్నది నా ప్రశ్న.

ప్రాజెక్టు వర్క్ వంటివి సిబిఎస్ఇ సిలబస్‌లో ఎక్కువగా ఉండటం వల్ల అది ఐఐటి ఎంట్రెన్స్‌కు కొంతమేలు చేయవచ్చని కొందరి అభిప్రాయం. అందుకోసం వాటిని మన సిలబస్‌కు అనువర్తనం చేసుకుంటే సరిపోతుంది. ముఖ్యంగా మన రాష్ట్ర సిలబస్‌తో చదివే విద్యార్థులు సిద్ధాంతపరమైన అంశాలపై మంచి పట్టు కలిగి ఉంటున్నారు. విద్యార్థులకు ఉండే ఈ సౌలభ్యాన్ని దూరం చేయడం సరికాదు. సిబిఎస్ఇ సిలబస్ పేరుతో సరైన బోధనాభ్యసన వాతావరణం లేకుండా ప్రయోగాలు చేస్తే ప్రతికూల ఫలితాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

వెబ్ వాచ్

బీబీసీ విజ్ఞాన సర్వస్వం

ప్రపంచ ప్రసార మాధ్యమాల్లో బీబీసీకి ఉన్న ప్రాధాన్యం అందరూ ఎరిగిందే! సమాచార విస్ఫోటన నేపథ్యంలో ఎన్ని సంస్థలు పుట్టుకొచ్చినా బీబీసీ తన ప్రత్యేకత నిలుపుకొంటూనే ఉంది. సమాచారం, వినోదం, విద్య తదితర రంగాల్లో బీబీసీ స్థానం తిరుగులేనిది. అదే ఒరవడిలో అది ఆన్‌లైన్ మాధ్యమంలోకి ప్రవేశించింది. అచిర కాలంలోనే తనదైన ముద్రను వేసింది. అనేకానేక అంశాలపై లెక్కలేనంత సమాచారాన్ని అది ప్రోది చేసింది. విద్యకు సంబంధించి ఈ- లెర్నింగ్ పోర్టల్‌ను రూపొందించింది. అదే www.bbc.co.uk.. ఒక్కసారి అందులోకి ప్రవేశిస్తే చాలు..ఒక్కో లింక్‌ను క్లిక్ చేస్తూ పోతుంటే, గంటలు నిమిషాల్లా గడిచిపోతాయి.

యువత కోసం అనేక ఆన్‌లైన్ కోర్సులు అందులో పొందుపరిచారు. ఆకర్షణీయమైన గేమ్స్, వీడియో క్లిప్పింగులు, విద్యార్థులకు అవసరమైన కార్యకలాపాల వివరణలు కన్పిస్తాయి. ఉపాధ్యాయులకు తమ బోధనను బలోపేతం చేసుకునేందుకు అవసరమైన వనరుగా ఉపయోగపడితే.. విద్యార్థుల తలిదండ్రులకు చక్కటి మార్గదర్శిగా పోర్టల్‌ను రూపొందించారు.

ఏ అంశాన్నయినా సీరియస్‌గా నేర్చుకోవాలని భావించే వారిని పోర్టల్ నిరాశపర్చదు. అందులోకి ప్రవేశించగానే కుడివైపు 'చూజ్ వన్' అన్న టూల్‌బార్ కన్పిస్తుంది. దాని కింద అడల్ట్ లర్నర్స్, పేరెంట్స్, టీచర్స్, స్కూల్ స్టూడెంట్స్ అన్న విభాగాలుంటాయి. ఇంగ్లిష్ స్పెల్లింగ్, గ్రామర్, కంప్యూటర్, మేథ్స్‌పై పట్టు సాధించడం నుంచి వివిధ భాషలను నేర్చుకోవాలంటే.. అడల్ట్ లెర్నర్స్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. చదవడం, రాయడంతో పాటు గణితంలో ప్రాథమిక నైపుణ్యాలను సాధించేందుకు పెద్దలకు ఉపయోగపడుతుంది. ఈ పోర్టల్ ద్వారా 12 వారాల పాటు కోర్సు అభ్యసించిన విద్యార్థులకు పరీక్ష నిర్వహించి బీబీసీ సర్టిఫికేట్లను సైతం ప్రదానం చేస్తుంది. ఇదే విభాగంలో 36 భాషల్లో పదబంధాలను త్వరితగతిన చూసే వీలుంటుంది. తమాషా వీడియోలు, టంగ్ ట్విస్టర్స్ ఉంటాయి. వివిధ నైపుణ్యాలను, విజ్ఞానాన్ని అందించే లక్ష్యంతో ఈ సైట్ రూపొందింది. కంప్యూటర్ల వినియోగం, ఇంటర్నెట్ వాడకం, డబ్బులను సరిగా వ్యయం చేయడం లాంటి ఎన్నో నిత్యజీవితంలో అవసరమయ్యే అనేక విషయాలను సైతం సైట్ శాస్త్రీయంగా అందిస్తుంది.

ఈ పోర్టల్‌లో ఏదైనా కొత్త విషయాన్ని నేర్చుకోవడం అత్యంత ఉత్సాహాన్నిచ్చేలా రూపొందించడం విశేషం! క్విజ్‌లు, గేమ్‌లు కల్పించే ఆనందాలే కాదు; సైన్స్ విషయాలకు వస్తే కట్టిపడేసే ప్రయోగాలూ ఉంటాయి. బీబీసీకి చెందిన యాంకర్లు అత్యంత ఆకర్షణీయంగా తమ ప్రెజెంటేషన్స్ ఇస్తారు. చరిత్రపై పట్టు బిగించాలన్నా, ఆంగ్లం నేర్చుకోవాలన్నా వార్తలు..బొమ్మలు..ఆటలు..ఆడియో ఎన్నెన్నో మార్గాలను పోర్టల్ ఆవిష్కరిస్తుంది. ప్రతి ఒక్కరికి ఉపయుక్తమయ్యే ఏదో ఒక అంశాన్ని అందించడం బీబీసీ పోర్టల్ ప్రత్యేకత. పూల కుండీల్లో మొక్కల పెంపకం నుంచి..అనేక అంశాలపై అనేక లింక్‌లు పోర్టల్‌లో లభిస్తాయి. కొన్ని అంశాలు మాత్రం కేవలం ఇంగ్లండ్ వాసులకు మాత్రమే ఉపయుక్తమయ్యే రీతిలో రూపొందించినప్పటికీ- మొత్తంగా పోర్టల్ ప్రపంచంలోని ప్రతి ఒక్క ఔత్సాహికునికీ అందుబాటులో ఉన్న విజ్ఞాన సర్వస్వమేనని చెప్పవచ్చు. అందుకే.. ప్రపంచంలోని అత్యుత్తమ 100 పోర్టల్లలో ఇది నిలవడం ఏమీ ఆశ్చర్యం కలిగించదు.